మధ్యాహ్నం మూడు గంటలకు.....

ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు. అతని వెనకాలే సీత కూడా వెళ్ళింది.

ఆఫీసులో అందరూ చెవులు కొరుక్కున్నారు. ఆ సీను చూసి బుచ్చిబాబు మరోసారి జాతీయత భావంతో బాధగా మూలిగాడు.

"హేరామ్!..... హయ్ అల్లా!!......ఓ జీసస్!!........."

క్యాబిన్‌లో.....

ఏకాంబరం తన సీట్లో కూర్చున్నాడు. అతని మొహంలో ఎంతో తృప్తీ, మరెంతో ఆనందం.

సీత అతని ఎదురుగా కూర్చుంది.

"లంచ్ ఎలా ఉంది సీతా?" అడిగాడు ఏకాంబరం .

"చాలా బాగుందండీ....బహుశా మీతో కలిసి చేయ్యటం వల్లేమో!?" అంది సీత .

ఏకాంబరం మురిసి ముక్కలైపోయాడు.

"థాంక్యూ సీతా......థాంక్యూ" అన్నాడు ఉక్కిరి బిక్కిరి అయిపోతూ.

"చూడండీ......మీతో కాబట్టి లంచ్‌కి బయటికి వచ్చానుగానీ నేను అందరితోనూ వెళ్తానా?....." గారాలు పోతూ అంది సీత .

"అవునవును...ఎలా వెళ్తావ్!?....ప్రతి కిల్లారికిత్తిగాడితో వెళ్తే ఇంక అయినట్టే......"

"అవునా?.....కానీ ఆ మోహన్ గాడు నన్ను అక్కడికి ఇక్కడికి రమ్మని పీక్కుతింటున్నాడు"

"నువ్వేం వర్రీ కాకు సీతా... ఆ డస్కు డమాల్‌గాడి గురించి అన్ని ఏర్పాట్లూ చేసి పెట్టి ఉంచా!" అని బెల్ కొట్టాడు.

ప్యూన్ క్యాబిన్‌లోకి వచ్చాడు.

"ఆ మోహన్‌గాడిని వెంటనే రమ్మని పిలువ్" అన్నాడు ఏకాంబరం .

ప్యూన్ క్యాబిన్‌లోంచి బయటకి వెళ్ళిపోయాడు.

మరో నిముషంలో మోహన్ లోపలికి వచ్చాడు.

మోహన్ని చూస్తూనే ఏకాంబరం నిప్పు తొక్కిన కోతిలా చిందులు వేసి అతన్ని ముక్కు చీవాట్లు వేసి "నీకు డిసిప్లిన్ లేదు....డ్యూటీ కాన్షస్‌నెస్‌లేదు.... అందుకే నిన్ను ఉత్తర భారతదేశంలోని ఓ మారు మూల పల్లెటూరికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నా!" అని రంకెలు వేస్తూ అర్చి టేబుల్ సొరుగు లాగి ఒక కవర్ తీసి మోహన్ మొహన కొట్టాడు.

ఆ కవర్ అందుకుని జేవురించిన మొహంతో క్యాబిన్ బయటికి నడిచాడు మోహన్ . బయటికి వెళ్తూ వెళ్తూ సీత వంక చూసిన మోహన్‌కి ఆమె కళ్ళలో అంతులేని తృప్తీ, కసీ కనిపించాయ్......

అదే రోజు సాయంత్రం పార్టీ కూడా పెట్టకుండా మోహన్‌ని రిలీవ్ చేసి పంపించేశాడు

ఏకాంబరం .

రాత్రి...ఎనిమిది గంటల ప్రాంతంలో....

బుచ్చిబాబు వంటగదిలో చపాతీ కోసం పిండి తడుపుతున్నాడు. ఆ వారం వంట బుచ్చిబాబు వంతు.

సరిగ్గా అ సమయంలో డోర్ బెల్ మోగింది. తలుపు తియ్యడానికి సీత ఉంది కదా అని బుచ్చిబాబు లేవలేదు.

డోర్‌బేల్ మోగుతూనే ఉందిగానీ సీత తలుపు తియ్యడం లేదు.

"సీతా.....ఎవరో వచ్చినట్టున్నారు కాస్తా తలుపు తీస్తావా...నేను వంటగదిలో పనిలో ఉన్నాను" అంటూ అరిచాడు బుచ్చిబాబు .

"నేను స్నానం చేసి చీర మార్చుకుంటున్నా...నువ్వే తలుపు తియ్" బెడ్ రూంలో నుండి అరిచింది సీత .

ఆ బెల్ నొక్కినవాడెవడో ఇప్పుడు బెల్ నొక్కుతూ తలుపులు కూడా దబదబా బాదేస్తున్నాడు రెస్ట్‌లెస్‌గా.

బుచ్చిబాబు పిండి చేతులు కూడా కడుక్కోకుండా బయటికి పరుగుతీసి ఎవడ్రా వాడూ అని మనసులో తిట్టుకుంటూ వీధి తలుపులు తీశాడు.

ఎదురుగా పరంధామయ్య!.......

పరంధామయ్య అంటే బుచ్చిబాబు తండ్రికి స్నేహితుడు....హైదరాబాదులో అప్పుడప్పుడూ వాళ్ళింటికి వచ్చేవాడు.

"ఆ ఏంటోయ్...బాగున్నావా?" అన్నాడు పరంధామయ్య చిరునవ్వుతో పలకరింపుగా.

"బాగానే ఉన్నాను!..... రండి!" అన్నాడు.

పరంధామయ్యని హాల్లో కూర్చోబెట్టి కంగారుగా బెడ్ రూంలోకి పరుగుతీసి "నువ్విప్పుడు బయటకు రాకు!" అంటూ సీత చెవిలో గుసగుసగా అని మళ్ళీ బయటికి వచ్చి పరంధామయ్య ఎదురుగా కూర్చున్నాడు బుచ్చిబాబు .

"ఏంటీ?.....ఇంట్లో నువ్వు ఒంటరిగా ఉన్నావా మనుషుల అలికిడే లేదు!" అడిగాడు పరంధామయ్య.

ఆ ప్రశ్న వింటూనే బుచ్చిబాబు గతుక్కుమన్నాడు.

"ఈయనేంటి ఇలా అంటున్నాడు....కొంపదీసి నేను సీతతో ఉంటున్నానని తెలిసిందా.....తెలిస్తే ఇంకేమయినా ఉందా?....హమ్మో నాన్నగారికి చెప్పెయ్యడూ?" అనుకున్నాడు.

"మనుషుల అలికిడా?....హ హ హ ...ఎందుకుంటుందీ...నేను ఒంటరిగానే ఉన్నాకదా...కావాలంటే చూడండి...నా చేతులనిండా పిండి! చపాతిల కోసం పిండి కలుపుతున్నానన్నమాట హి హి హి .......నాతో ఆడపిల్ల ఎవరయినా ఉందనుకోండి, నన్నిలా

పిండి కలపనిస్తుందా? హ్హో హ్హో హ్హో.....". బలవంతంగా నవ్వు తెప్పించుకుంటూ అన్నాడు బుచ్చిబాబు.

"ఆడపిల్లేంటి నీతో కలసి ఉండడం ఏంటీ...నాకు పిచ్చెక్కించేలా ఉన్నావయ్యా బాబూ... అలా అని నేనెందుకు అనుకుంటానూ.... నేనడుగుతున్నది మీ అమ్మానాన్నల గురించి!" అన్నాడు పరంధామయ్య.

బుచ్చిబాబు తెల్లబోయి పరంధామయ్య వంక చూశాడు.

"మా అమ్మానాన్నల గురించి ఇక్కడెందుకు అడుగుతున్నాడు?...... వాళ్ళుండేది హైదరాబాద్‌లో కదా?"

"మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో మీ ఇంటికి వెళ్ళానోయ్.....అప్పుడు మీ నాన్నగారు చెప్పారు ఒకట్రెండు రోజుల్లో విజయవాడ వెళ్ళాలని అనుకుంటున్నానని! బహుశా రేపు ఉదయం దిగుతారేమో!!" అన్నాడాయన.

హ!.....మళ్ళీ వస్తున్నారా?!

బుచ్చిబాబు గుండెల్లో దడ మొదలైంది.

"ఏంటి బాబూ మొహం అలా పెట్టావ్? ఏం...మీ అమ్మానాన్నలు రావడం నీ కిష్టం లేదా? ఈ వయసులో ఆ ముసలి తల్లిదండ్రుల్ని ప్రేమగా చూస్కోబాబూ.... వాళ్ళతో  అప్యాయంగా నాలుగు ముక్కలు మాట్లాడితే చాలు..... ఏ తల్లిదండ్రులకైనా అంతకు మించి కోరికలు ఉండవ్ బాబూ......"

బుచ్చిబాబు కంగారు పడిపోయాడు.

" ఛి ఛి.....భా భా భా....అదేం కాదండీ.....మా అమ్మానాన్న వస్తే నాకెంత ఆనందమొ!....హి హి హి !! సరేగానీ మీరేంటి మా ఊరొచ్చారు?" అన్నాడు బుచ్చిబాబు అదేపనిగా నవ్వేస్తూ.

"ఇక్కడో పెళ్ళి వుంటే వచ్చాను! వస్తాను బాబూ" లేచాడు పరంధామయ్య.

"అయ్యో!....ఉం ఇడి కాఫీ పెట్టుకుని వస్తాను!"

"అబ్బే......వద్దుబాబూ....ఇప్పుడింటికెళ్ళగానే భోజనం చేయాలి.....మీ నాన్నగారున్నారేమో మాట్లాడి పోదామని వచ్చా----ఒహవేళ రేపొద్దున్న మీ నాన్నగారు గనుక వస్తే చెప్పు నేను వచ్చి వెళ్ళానని! నేను ఇప్పుడే పదకొండు గంటల బస్సుకి హైదరాబాద్ వెళ్ళిపోతున్నా...... వస్తానబ్బాయ్!" అంటూ బయటికి నడిచాడు పరంధామయ్య.

అతను వెళ్లాక బుచ్చిబాబు కాళ్ళూ చేతులు ఆడలేదు.

సంగతి తెలిసిన సీత మండిపడుతూ బుచ్చిబాబుని అడిగింది "అయితే ఈ సారి నన్నెవరి ఇంట్లో పెడ్తున్నావ్?"

బుచ్చిబాబు ఆలోచనలో పడ్డాడు.

అవును.....ఇప్పుడెలా?...।ఆ మోహన్ గాడితో కూడా గొడవొచ్చి పడింది.

"పోనీలే....ఆ ఇంటిలో ఉంటాలే....." మళ్ళీ సీతే అంది.

"వద్దు.....వద్దు....వద్దు...." అరిచాడు బుచ్చిబాబు .

"మరి?.... ఏకాంబరం  ఇంటిలో ఉండమంటావా?"

"ఆ ముసలి కిల్లారికిత్తిగాడి ఇంటిలో అసలు ఉండొద్దు!....ఐనా వాళ్ళు వస్తారో రారో....ఇప్పటి నుండి ఎందుకంత ఆందోళన పడటం?"

"ఆందోళన?...నేను పడ్తున్నానా?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది సీత

బుచ్చిబాబుకి అస్సలు తిండి సహించలేదు. మంచం మీద పొర్లుతున్నాడు గానీ నిద్ర అస్సలు పట్టడం లేదు.

హఠాత్తుగా బుచ్చిబాబుకి బ్రిలియంట్‌గా ఓ ఆలోచన  వచ్చింది. సీతని తట్టి లేపాడు.

" సీతా...నేనిప్పుడే వస్తా తలుపేస్కో" అంటూ బెడ్‌రూంలోంచి బయటికి నడిచాడు.

"ఎక్కడికెళ్ళుతున్నావు?" వెనుకనుండి అరిచింది సీత .

"హైదరాబాద్‌కి ఫోన్ చెయ్యడానికి" వెనక్కి తిరగకుండానే సమాధానం చెప్పాడు బుచ్చిబాబు .

సందు మొదటిలో ఉన్న యస్టీడి బూత్‌లోకి దూరాడు. హైదరాబాద్‌కి ఫోన్ కొడ్తే సస్పెన్స్ విడిపోయి హాయిగా నిద్రపోవచ్చు అనుకున్నాడు.

అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలైంది.

బుచ్చిబాబు హైదరాబాద్‌లోని వాళ్ళ ప్రక్క ఇంటికి ఫోన్ చేశాడు.

"ఏరా వెధవాయ్! మళ్లీ ఫోన్ చేశావా?..నీకు బుద్ధిలేదురా? నీకు అమ్మా, అమ్మమ్మా, నాయనమ్మలు లేర్రా?... అసలు నా వయసెంతో తెలుసురా నీకు?" అవతలి నుండి ఓ ఆడకంఠం అరుస్తూంది.

"ఆంటీ ఆంటీ... నేనాంటీ బుచ్చిబాబుని!" కంగారుగా అన్నాడు బుచ్చిబాబు .

"హోరినువ్వటోయ్? ఇందాకట్నుండీ ఎవడో యెదవ న్యూసెన్సు కాల్సు చేస్తుంటేను....ఎక్కడినుండీ....విజయవాడ నుండేనా?"

"అవునాంటీ"

"ఇందాకే ఓ గంట క్రితం మీ అమ్మానాన్న బస్సు స్టాండుకి బయలుదేరి వెళ్ళిపోయారు...."

"ఎందుకనీ....విజయవాడ రావడానికేనా?" అడిగాడు బుచ్చిబాబు .

"అవును బాబూ...ఏం నీకు తెలీదా?"

"ఎందుకు తెలీదండి?.....హి హి హి...నేనేగా విజయవాడకి తప్పకుండా రమ్మని ఉత్తరం రాసింది...అందుకనే బయలుదేరారో లేదో తెలుసుకుందామనీ ఫోన్ చేశా!"

"బయలు దేరారు నాయనా...రేపు తెల్లారి ఆరుగంటల కళ్ళా నీ దగ్గర ఉండరూ!" బుచ్చిబాబు చేతిలోంచి రిసీవర్ జారిపోయింది.

0 0 0

ఆటో హోటల్ రంభముందు అగింది. బుచ్చిబాబు , సీత ఆటోలోంచి దిగారు. ఆటోకి డబ్బులు ఇచ్చి హోటల్ రిసెప్షన్ వైపు అడుగులు వేశాడు బుచ్చిబాబు.

"అయితే నన్నిప్పుడు ఈ హోటల్‌లో ఉంచుతావన్నమాట" అడిగింది సీత.

అవునన్నట్టు తల ఉపాడు బుచ్చిబాబు.

"కానీ నేను హోటల్ రూంలో ఒక్కదాన్నీ ఎలా ఉంటాను?"

"నేను కూడా ఉంటాను! ఒక్కదానివే అని ఎవరన్నారు?!" విసుగుని దాచుకుంటూ సమాధానం చెప్పాడు బుచ్చిబాబు .

"రేపు మీ అమ్మానాన్నా వచ్చాక ఎలా ఉంటావ్?" సందేహంగా అడిగింది సీత.

"రేపటి సంగతి రేపే ఆలోచిద్దాం" అన్నాడు బుచ్చిబాబు .

రిసెప్షన్ కౌంటర్లో కునికిపాట్లు పడుతున్న వ్యక్తి కళ్లు భారంగా తెరిచాడు.

"ఓ డబుల్ రూం కావాలి!" అన్నాడు బుచ్చిబాబు .

కౌంటర్‌లోని వ్యక్తి రిజిస్టర్‌ని బుచ్చిబాబు ముందుకి తోశాడు. దాంట్లో కాలమ్స్ ఫిలప్ చేసి అడ్వాన్సు ఇచ్చాడు బుచ్చిబాబు . కౌంటర్లో వ్యక్తి బెల్ కొట్టి బోయ్‌ని పిలిచాడు. బోయ్‌కి రూం తాళం చేవి ఇచాడు.

బోయ్ ఆ సూట్‌కేసు తీసుకుని ముందుకు అడుగులు వేశాడు. వాడిని అనుసరించా రు సీత, బుచ్చిబాబు . అప్పుడు గోడ గడియారం 12 గంటలు కొట్టింది.

నిముషం తర్వాత....

"గది ఖాళీ ఉందా?" కరుకుగా ఉన్న ఈ బోగురు గొంతు పలికింది.

రిసెప్షనిస్టు ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. ఆరడుగులు ఉన్న ఓ భీకరాకరం అతని ముందు నిలబడి ఉంది.

అతనే రుస్తుం దాదా.....

0 0 0

సీత ఉలిక్కిపడి నిద్ర నుండి లేచింది.

బుచ్చిబాబు ఆమె మొమోంలో మొహం పెట్టి చూస్తూ పిలుస్తున్నాడు.

సీత  కళ్లు నులుముకుంటూ బుచ్చిబాబు మొహంలోకి చూస్తూ ఆవులించింది.

"ఏంటి? అప్పడే తెల్లారిందా?" బద్దకంగా అడిగింది.

"లేదుగానీ మా ఇంటికెళ్ళొస్తా...నువ్వు ఇంకాస్సేపు పడుకో" అన్నాడు బుచ్చిబాబు .

సీత మత్తు వదిలిపోయింది.

"మీ ఇంటికా? ఇప్పుడెందుకు?"

"ఇంకాసేపట్లో మా అమ్మానాన్నా వస్తారుగా....ఇంటికి తాళం వుంటే ఎలా?"

"మరి నా సంగతేంటి? ఈ హోటల్ రూంలో నేను ఒక్క ర్తినే ఎలా వుంటాను?"

"నువ్వు హాయిగా ఇంకాస్సేపునిద్రపో...ఇప్పుడు టైం ఇంకా నాలుగున్నరే అయింది. ఏడు దాకా పడుకుని మోహం కడుక్కుని టిఫిన్, కాఫీలు తెప్పించుకో. స్నానంచేసి తయారవు. ఈలోగా నేను వచేస్తా....ఇద్దరం కలిసి ఆఫీస్‌కెళ్దాం"

"మరి రాత్రి సంగతేంటి? రాత్రి నువ్వు ఇక్కడ పడుకోవా? అలాగయితే నేను నవీన్ ఇంటికి వెళ్ళిపోతా బాబూ"

"హబ్బా!" బుచ్చిబాబు బాధగా జుట్టు పీక్కున్నాడు.

"కోతికి కొబ్బరికాయ దొరికినట్టు నీకు ఆ నవీన్‌గాడు దొరికాడు. నిన్ను ఒక్కదాన్నీ వదిలిపెట్టి నేను వేరే ఎక్కడో ఎందుకు పడుకుంటాను?"

"మరి మీ అమ్మానాన్నలకు ఏమని చెప్పి వస్తావ్?"

"అ సంగతి సాయంత్రం ఆలోచిద్దాం. నీతో ఇలా మాట్లాడుతుంటే అవతల మా అమ్మానాన్నా వచ్చేస్తారు" అంటూ హోటల్ గదిలోంచి హడావిడిగా బయటకు పరుగుతీసాడు బుచ్చిబాబు .

0 0 0

ఉదయం అయిదున్నర గంటలైంది. ఆ మసక వెలుతురులో హైదరాబాద్ విజయవాడ బస్సు రివ్వున వచ్చి బస్టాండులో అగింది. దాంట్లోంచి పర్వతాలరావు , పార్వతమ్మ దిగారు.

"హబ్బ ఒళ్ళు హునం అయిపోయింది. అందుకే బస్సు ప్రయాణం వద్దండీ, రైల్లో వెళ్దామండి అంటే వినలేదు మీరు....." అంది పార్వతమ్మ .

"మనం హఠాత్తుగా ఇక్కడికి బయలుదేరాం. నీకు అప్పటికప్పుడు రైలు రిజర్వేషన్ టికేట్లు ఏ పింజారీ వెధవిస్తాడు? బెర్తులు, రిజర్వేషన్లు చేయించాలంటే కనీసం వారం టైముండాలి" విసుక్కున్నాడు పర్వతాలరావు .

"సర్లేండి పదండి....ఇంతకి ఈ మసక చీకట్లో మీరు ఇల్లు గుర్తు పట్టగలరుగా?"